క్లుప్తంగా

ఇంద్రవెల్లిలో 'ముసురు'

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తోంది. వానకు మండలంలోని ఏమాయికుంట గ్రామపంచాయతీ పరిధి సుందర్‌నగర్‌కు చెందిన లోకండే అనుసాయబాయి ఇల్లు బుధవారం నేలమట్టమైంది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి తడిచిపోయాయి. మండలంలోని ఖైర్‌గూడ, సుందర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, గోపాల్‌పూర్, మామిడిగూడ గ్రామాల మట్టిరోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



ఇంకుడు గుంత పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా

నార్నూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. సంక్షేమ పథకాల అమలుతీరు అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పనులను పరిశీలించి ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో గంగాసింగ్, ఈజీఎస్ టీఏ కైలాస్ జాదవ్ తదితరులు ఉన్నారు.

'వలస వచ్చిన వారికి ధ్రువీకరణ పత్రాలివ్వొద్దు'

నార్నూర్: మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన బీసీలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దని బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి రాథోడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలం మహారాష్ట్ర సరిహద్దు కావడంతో అక్కడి నుంచి కూలి పని కోసం వలస వచ్చి ఇక్కడ స్థిరపడి ఎస్టీలుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 1977 తర్వాత వచ్చిన వారికి ఎస్టీలుగా చలామణి అయ్యే అర్హత లేదన్నారు. బీజేపీ నాయకులు చౌహాన్ భరత్, సత్యపాల్, ప్రకాశ్, శ్రీధర్, ధర్మ రక్షక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

'ఉపాధ్యాయ ధర్నా విజయవంతం చేయాలి'

ఇచ్చోడ: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ధర్నా, రాష్ట్రస్థాయి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో, ఆగస్ట్ 23న హైదరాబాద్‌లో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్, రాజేందర్, కార్యవర్గ సభ్యులు జ్ఞానోబా, శ్రీధర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ఉట్నూర్‌రూరల్: పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ యాకోబు ఒక ప్రకటనలో తెలిపారు. లాల్‌టేకిడి ఆవరణలో గల బాలుర జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (డీఈఈఈ -42 ఖాళీలు), డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ (డీఎంఈ -56 ఖాళీలు) రెండు బ్రాంచ్‌లలో స్పాట్ అడ్మిషన్‌ల ద్వారా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 99497 63624లో సంప్రదించాలని కోరారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

నార్నూర్: గాదిగూడ మండలంలోని కస్తూర్బా గాంధీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారిణి సరస్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 28, బైపీసీలో 9 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులు కళాశాలలో అడ్మిషన్ పొందాలని సూచించారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యాబోధన



బ్యాగులలో విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని సామాజిక కార్యకర్త ముదుపు మౌనిష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులను ఆయన పంపిణీ చేశారు.

జోరుగా 'బెల్ట్' దందా..!

- విచ్చలవిడిగా దుకాణాలు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



పోలీసులు పట్టుకున్న దేశీదారు బాటిళ్లు (ఫైల్)

తలమడుగు: గ్రామాల్లో జోరుగా బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ దుకాణాల్లో, రోడ్ల సమీపంలో, పంట పొలాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపులో అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో జోరుగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాలలో వేలం పాడి లక్షల రూపాయలు వెచ్చించి మరీ బెల్ట్‌షాపులు దక్కించుకుంటున్నారు. తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలు మహారాష్ట్ర సమీపంలో ఉండడంతో ఈ మండలాల్లోని సరిహద్దు గ్రామాల్లో దేశీదారు మద్యం విక్రయిస్తున్నారు. గ్రామాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా అడిగితే దాడులకు దిగుతున్నారు.

రూ. 10 లక్షల వరకు..

బెల్ట్ షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఒకటి, రెండు గ్రామాలలో వేలం పాడి బెల్ట్‌షాపులు నిర్వహించేవారు. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెద్ద గ్రామాలలో సైతం వేలం పాడి రూ.10 లక్షల వరకు వెచ్చించి మరీ షాపులు దక్కించుకున్నారు. అంత పెద్ద మొత్తంలో ఒక్క బెల్టుషాపు కోసం ఖర్చు చేస్తున్నారంటే ఆదాయం ఏ మేరకు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కిరాణాషాపుల్లో సైతం బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

బానిసగా యువత..

తాంసి మండలంలో ఒక వైన్స్, భీంపూర్ మండలంలో ఒకటి, తలమడుగు మండలంలో రెండు వైన్సులు ఉన్నాయి. కాగా గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం దొరకడంతో యువత మద్యానికి బానిసవుతున్నారు. మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయక జీవితంపై విరక్తి చెంది పలువురు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, పోలీసులు బెల్ట్ షాపులపై చర్యలు తీసుకొని నియంత్రించాలని మండలవాసులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తున్నాం. గ్రామాల్లో ఎవరైనా కిరణా దుకాణంలో మద్యం విక్రయించినట్లు సమాచారం ఇస్తే దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నాం. సమాచారం ఇచ్చిన వారిపేరు గోప్యంగా ఉంచుతాం. ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుంటాం.

– రాధిక, ఎస్సై

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మల్లెపూల నర్సయ్య

బోథ్: కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, గొర్లరాజు యాదవ్, పసుల చంటి, బద్దం పోతారెడ్డి, పాండురంగ్, అరుణ్ రెడ్డి, హీరాసింగ్, షేక్ అబూద్, సద్దాం, అశోక్, కిషన్, శివుడు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలి

ఇచ్చోడ: కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. చైర్మన్‌గా ఎన్నికై మొదటిసారిగా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా నాయకులు శాలువాతో సత్కరించారు. మార్కెట్ చైర్మన్ సత్యవతికోటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు కల్లెం నారాయణరెడ్డి, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాల అధ్యక్షులు షేక్ఇమామ్, జల్కెపాండురంగ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ చౌహాన్ శేషారావు, మైనార్టీ చైర్మన్ ముస్తాఫా, ఎస్సీసెల్ చైర్మన్ కొత్తురి లక్ష్మణ్, నాయకులు ఆసీఫ్, జహేద్ పాల్గొన్నారు.

ఘనంగా శీరల్ ఉత్సవాలు



మహిళలు తయారు చేసిన శీరల్ దేవతల విగ్రహాలు

ఇంద్రవెల్లి: మండలంలో ఆంధ్ ఆదివాసీ గ్రామాల్లో నాగుల పంచమి మరుసటి రోజు నిర్వహించే శీరల్ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అంజీ, హర్కపూర్‌అంద్‌గూడ, మామిడిగూడ, అంద్‌గూడ తదితర గ్రామాల్లో పొలిమేరల్లో గల పుట్టమట్టిని గ్రామ పెద్ద ఇంటికి తీసుకొచ్చి శిరాళ్ దేవతల విగ్రహాలను తయారు చేసి పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ఊరేగించారు. ఆంధ్ ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని అంధ్ ఆదివాసీ గ్రామాల్లో బుధవారం శీరల్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంధ్ సమాజ్ మహిళలు మట్టితో శీరల్ విగ్రహాలు తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం శీరల్ విగ్రహాలను కడెం నదిలో నిమజ్జనం చేశారు. జల్కె పాండురాంగ్, నారాయణ, ముకుంద రావ్, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ -కె గ్రామంలో బుధవారం ఉదయం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. రైతు రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తన ఎద్దును ఇంటి వద్ద కట్టి ఉంచాడు. ఇంటికి సరఫరా అయ్యే విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు ఎద్దుకు తగలడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.

రేషన్‌కార్డుల పంపిణీ వాయిదా

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన రేషన్‌కార్డు పంపిణీ కార్యక్రమం అనివార్యకారణాలతో వాయిదా వేసినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం తేదీని మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న 'శబరిమాత అఖండ జ్యోతి'

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో 45 రోజులుగా కొనసాగుతున్న అఖండ జ్యోతి కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రుయ్యాడి గ్రామస్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

బాలల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజేంద్ర ప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: బాలల అక్రమ రవాణా పెరిగిపోయిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం షూర్ ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో బాలల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చైల్డ్ ఉమెన్ ట్రాఫిక్ ఏవిధంగా జరుగుతుందో తెలియజేశారు. ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ ద్వారా పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. సీఐ పద్మ, రైల్వే పోలీసు సిబ్బంది శియారాం, వినోద్ పాటిల్, మిషన్ శక్తి కోఆర్డినేటర్ యశోద, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, వినోద్, కిరణ్, సౌమ్య, కృష్ణవేణి, శ్రీకాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు షాపులకు నోటీసులు జారీ

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: 'అనుమతి ఒక చోట.. అమ్మేది మరోచోట' శీర్షికన బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ రాజర్షిషా విచారణ చేపట్టాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. దీంతో డైరెక్టర్ రిమ్స్ ఆస్పత్రి ఆవరణలోని మెడికల్ షాపుతో పాటు విజయ డెయిరీ షాపులను పరిశీలించారు. ఆ షాపులు నిబంధనల మేరకు కొనసాగిస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. మెడికల్ షాపు, విజయ డెయిరీ షాపులు ఇతర వస్తువులు విక్రయించడంతో నిబంధనల మేరకే అమ్మకాలు జరపాలని షాపుల యజమానులను ఆదేశించారు. రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవాలని, లేకుంటే చర్యలు చేపడుతామని హెచ్చరించారు. నోటీసులు జారీ చేయాలని సెక్షన్ ఉద్యోగులకు సూచించారు.



మెడికల్ షాపు పరిశీలిస్తున్న జైసింగ్ రాథోడ్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బస్టాండ్‌లోని మరుగుదొడ్లు పరిశీలిస్తున్న అధికారులు

బోథ్: మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమ జిల్లా సభ్యురాలు పద్మ, ఎంపీడీవో రమేశ్‌లు గ్రామంలోని ఇండ్లు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, సామూహిక మరుగుదొడ్లను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై వివరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ చెత్త వేయకుండా, డంపింగ్ యార్డులకు తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవో అంజయ్య, ఎస్బీఎం కోఆర్డినేటర్లు, పంచాయతీ సిబ్బంది, గ్రామ స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఉద్యమాలే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తెలిపారు. విద్యార్థుల పక్షాన ఉండి పోరాటాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తమ సంఘం పనిచేస్తుందన్నారు. అనంతరం రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరేందర్, సతీశ్, వెంకట్, అజయ్, గణేశ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామ సమీపంలో బుధవారం అదుపుతప్పి లారీ బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు లారీ వెళ్తున్నట్లు సమాచారం.

చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఐండ్ల శశికాంత్

తలమడుగు: ప్రతి పౌరుడికీ చట్టాలపై అవగాహన ఉండాలని అప్పుడే తప్పులు జరిగే అవకాశం ఉండదని తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటర్ కమిటీ సభ్యుడు ఐండ్ల శశికాంత్ అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతీ నెల ఒక గ్రామాన్ని ఎంచుకొని చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాయి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్, రెండేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అప్పులపాలు చేశాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సాత్నాల మండలం జామిని గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రేణుక బాయితో పాటు పలువురు బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధానాల వల్ల రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు పోతురాజు రమేశ్, మహేందర్, రోహిదాస్, దినేష్, దాదారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న నరేందర్‌రాథోడ్

ఇచ్చోడ: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి నరేందర్‌రాథోడ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు ల్యాబ్, ఫార్మసీ, ప్రసూతి వార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు. వైద్యాధికారి కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని కరత్వాడ గ్రామపంచాయతీ పరిధి జీడిపల్లె గ్రామ ప్రజలు బుధవారం ఎంపీడీవో రమేశ్‌ను కలిసి, తమ గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. జీడిపల్లె గ్రామంలో మొత్తం ఆదివాసీ గిరిజనులు నివసిస్తున్నారని, గ్రామానికి సుమారు 450 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం జీడిపల్లెకు చెందిన ఓటర్లు 6 కిలోమీటర్ల దూరంలోని కరత్వాడ గ్రామానికి వెళ్లి ఓటేయాల్సి వస్తోందని తెలిపారు. గ్రామస్తులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో అప్పారావు తెలిపారు.

మందు పిచికారీ.. పంట నష్టం

- ఆందోళనలో రైతు



పత్తి పంట వద్ద దిగాలుగా కూర్చున్న రైతు

ఇంద్రవెల్లి: మండలంలోని మర్కగూడ గ్రామపంచాయతీ పరిధి బుర్సన్‌పటార్ గ్రామానికి చెందిన రైతు సోన్‌కాంబ్లే విల్లాష్ సాగు చేసిన రెండెకరాల పత్తి పంటలో పురుగుల మందు పిచికారీ చేయగా పంట పసుపుపచ్చ రంగులోకి మారిపోయింది. బుధవారం రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న మండలకేంద్రంలోని మహన్విక ఫర్టిలైజర్ షాపు నుంచి కాన్ఫీడర్, అల్‌బేర్ట్ సోలుషన్ కిలో ప్యాకెట్ కొనుగోలు చేసి షాప్ నిర్వహకుడి సలహా మేరకు పత్తి పంటలో పిచికారీ చేశాడు. వారం తర్వాత పత్తి పంట పసుపుపచ్చగా మారింది. షాప్ యజమానికి విషయం తెలియజేస్తే స్పందించడం లేదని రైతు వాపోయాడు. పత్తి పంటను పరిశీలించి న్యాయం చేయాలని, తనను మోసం చేసిన మందుల దుకాణం యజమానిపై చర్యలు తీసుకోవాలని రైతు కోరాడు.

ఇంద్రవెల్లిలో చిన్నారికి డెంగీ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడలో ఓ చిన్నారికి డెంగీ పాజిటివ్ రావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడ గ్రామానికి చెందిన 4వ తరగతి విద్యార్థిని తోడసం నిహారికకు జ్వరం రావడంతో మండలకేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అయినా జ్వరం తక్కువ కాకపోవడంతో ఈనెల 28న జిల్లా కేంద్రంలోని సురక్ష ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీగా తేలింది. నిహారిక ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతోంది.

రోడ్లపైనే మూగ జీవాలు



ఉట్నూర్ ఐబీ రోడ్డుపై గుమిగూడిన పశువులు

ఉట్నూర్‌రూరల్: రోడ్లపై, సంతల్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు విసుగెత్తి పోతున్నారు. పట్టణ కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట, ఐబీ చౌరస్తా, పాత ఉట్నూర్, అంగడిబజార్ తదితర ప్రాంతాల్లో పశువులు గుంపులుగా రోడ్లపై తిరుగుతున్నాయి. పశువుల యజమానులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.



వారసంతలో సంచరిస్తున్న పశువు